


## యమ్. జయశ్రీ

# ఆ దేవుడే క్షమించాలి

గేటు తీయబోతూ ప్రక్కనే వున్న నేమ్‌ప్లేట్ వైపు మరోసారి చూసింది ఆమె.

"నిశాంతి. రచయిత్రి"

తెల్లటి బోర్డుమీద నల్లటి అక్షరాలు ముచ్చటగా వున్నాయి. గేటుతీసి అడుగు లోపలి కేసింది. లోపల ఆవరణలో చక్కటి పూలతోట వుంటుందనే ఆమె ఊహ తప్పయింది. ఆవరణ అంతా చిక్కుడు, బీర, దొండ పందిళ్ళు. ఒకపక్కగా ఆకుకూరల మడులు. మెల్లగా తలుపు తట్టింది.

ఒక రెండు నిమిషాల తర్వాత తలుపు తెరుచుకొంది.

"నిశాంతిగారు..." అర్థోక్తిలో ఆపేసింది.

"నేనే నిశాంతిని... మీరు?

"నేను మీ అభిమానిని నా పేరు 'నైనా' పక్కవూరి నుంచి వచ్చాను" చెప్పింది నైనా.

"సంతోషం! రామ్మా లోపలికి" లోపలికి ఆహ్వానించింది.

కాసేపు నిశ్శబ్దంగా కూర్చుంది నైనా. తలతిప్పి నిశాంతివైపు చూసింది.

నిశాంతి వయస్సు ముప్పై అయిదు సంవత్సరాలు వుంటుంది, కళ్ళజోడులోంచి 'నైనా'ని నిశితంగా చూస్తున్నాయి ఆమె కళ్ళు. ఆమె చూపులనుంచి తప్పుకొంటున్నట్లుగా కాస్త సర్దుకొని కూర్చుంటూ గొంతువిప్పింది.

"నేను మీ రచనలు అన్నీ చదివాను. మీ రచనలలో స్త్రీలకిచ్చే సందేశాలు, సలహాలు చాలా ఆలోచించేవిధంగా వుంటాయి. వాస్తవానికి దగ్గరగా వుండే రచనలు చేసే వారిలో మీరు మొదటి వారని నా అభిప్రాయం" చిరునవ్వుతో వింటూంది 'నిశాంతి'.

"రచయితగా మీరు ఎందరో జీవితాలను దగ్గరగా చూసి వుంటారు. నేను మిమ్మల్ని ఒక సలహా అడగాలని వచ్చాను" ఆగింది నైనా.

"తప్పకుండా చెబుతాను. అసలు నీ సమస్య ఏమిటి?"

"అసలు నా పెళ్ళయిన దగ్గర్నుంచి మీకు చెబితే నా భర్త మనస్తత్వం అర్థమౌతుంది" అంటూ మొదటి నుంచీ అంటే పెళ్లయిన రోజు దగ్గర్నుంచి ఈ రోజువరకు జరిగిన సంఘటనలు వివరంగా చెప్పింది.

"ఇప్పుడు చెప్పండి నిశాంతిగారూ నేను ఇంకా అటువంటి వ్యక్తితో కాపురం చేయగలనా? ఉద్రేకంగా అడిగింది 'నైనా'

ఒక్క నిమిషం ఏం మాట్లాడలేదు 'నిశాంతి'

నవ్వుతూ వున్న ఆమె మొఖం ఉదాసీనంగా మారింది.

"చూడమ్మా 'నైనా' నీకు సలహా చెప్పేముందు నా గురించి నీకు చెప్పాలనిపిస్తోంది.

చిలికి చిలికి గాలివానలా తయారయిన ఒక రోజు సంఘటనే నా జీవితాన్ని మార్చేసింది విను చెబుతా!

* * *

"ఇదిగో — నిశాంతి — ఇదే నీకు లాస్ట్ వార్నింగ్! నువ్వీ పిచ్చివేషాలు వేయటం ఇంకా తగ్గించకపోతే..." ఫలితం చాలా ఘోరంగా వుంటుంది అన్నట్లుగా చూస్తున్నాడు నిరంజన్.

"నేను వేసేవి పిచ్చివేషాలా?"

"ముమ్మాటికీ పిచ్చివేషాలే! ఎవడితోపడితే వాడితో షికార్లు కొడతావ్ — ఇంటి కెవడొచ్చినా ఎగబడి మాట్లాడ్తూ పగలబడి నవ్వుతావ్!

"ఆపండి మీ వాగుడు! మీరసలు చదువుకొన్న వారేనా? నేను సన్మానసభకెళితే షికార్లా? అభిమానులొచ్చి మాట్లాడితే ఎగబడి మాట్లాడ్డమా? అసలు మీకు నన్ను చూస్తే కుళ్ళండీ! అయినా పెళ్ళయిన కొత్తలో నువ్వు బాగా వ్రాయగలవు వ్రాయి నిశాంతీ— అని పదేపదే నన్ను మెచ్చుకోలేదూ?

"వ్రాయమంటే ఏదో ఇంట్లో కూర్చుని కాలక్షేపం చేస్తావనుకొన్నాను. కానీ ఇలా బరితెగించి తిరుగుతావనుకోలేదు" కోపంతో అతను కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి.

"అయినా ఇప్పుడు నీకు కాస్త పేరొచ్చేసరికి పళ్ళు పొగిరెక్కింది. పెళ్ళయిన కొత్తలో ఎంత అణిగిమణిగి వుండేదానివి?"

అవును పెళ్ళయిన కొత్తలో మీరు చేసే చెప్పే వెధవ పనులన్నీ సమర్థిస్తూ ఎడ్జస్ట్ అవుదామని ప్రయత్నించేదాన్ని. రచనల్లో ఆదర్శాలు చెబుతూ సంసారంలో కుళ్ళుని భరించలేను. మీ బంధువులు, స్నేహితులు "గొప్ప రచయిత్రిరా నీ భార్య" అంటే మాత్రం భుజాలెగర వేస్తారు. అడుగు బయటకు వేస్తే మటుకు నేను మిమ్మల్ని ఎక్కడ లెక్కచేయనో అని భయంతో ఛస్తూ వుంటారు. ఇల్లు దాటకూడదు ప్రతిసారీ ఎక్కడికెళ్ళినా మీ పర్మిషన్‌తో బయటికి వెళ్ళాలి. కనీసం లైబ్రరీకి కూడా! ఎన్నో విప్లవ రచనలు చేసిన నేను మీ వెనకాల కొంగుకప్పుకొని వ్యక్తిత్వం లేనిదాన్లా నిలబడాలి కదూ! మీలో ఇంతటి దారుణమైన ఆలోచనలు వుండబట్టే నన్ను చీటికి మాటికి ఛీదరిస్తున్నారు. ఆయాసంతో రొప్పుతోంది నిశాంతి.

"ఏమిటే తెగవాగుతున్నావ్? అసలు ఇంకా మాట్లాడావంటే నీకు నాకు సంబంధాలుండవ్ జాగ్రత్త నోరుమూసుకుని పడివుండు" మగాడి అహంతో శాసిస్తున్నాడు నిరంజన్.

ఛ... ఛ! ఇంత జరిగాక ఏం జరగనట్లు పళ్ళికిలిస్తూ మీతో కాపురం చేస్తాననుకున్నారా? మీకంటే ముందే నేను ఏనాడో నిశ్చయించుకున్నాను "మిమ్మల్ని వదిలేయాలని రేపే లాయర్ని కలుస్తాను" అక్కడే నిరంజన్ అహం గొప్ప దెబ్బతింది. కస్సున లేచాడు. అనాదిగా వదిలేయడం మగవాడి జన్మహక్కు. ఈ రోజు నిశాంతి ఆ హక్కు అమాంతం లాక్కుంటే ఊర్కుంటాడా? ఫలితం—

నిశాంతి జుట్టు దొరకబుచ్చుకుని బరబరా బయటకు ఈడుస్తూ 'పో... పోవే బయటికి రేపెందుకు ఈ రాత్రి పోయి లాయర్ని కలుప్. నిర్దాక్షిణ్యంగా ఆ రాత్రి నిశాంతిని బయటికి నెట్టేశాడు నిరంజన్.


* * *

నిశాంతి కను కొలకుల్లో కన్నీటి బిందువులు జారటానికి సిద్ధంగా ఉన్నాయి.

కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకొంది. అంటే మీరు... మీరు.

"అవునమ్మా నేను వంటరిగా జీవిస్తున్నాను. నిజానికి నేను వదిలేసినా ఈ సమాజంలో నన్నే మొగుడొదిలేశాడని

"ఇదిగో నిశాంతి—ఇదే నీకు లాస్ట్ వార్నింగ్! నువ్వీ పిచ్చివేషాలు వేయటం ఇంకా తగ్గించకపోతే.." ఫలితం చాలా ఘోరంగా వుంటుంది అన్నట్లుగా చూస్తున్నాడు నిరంజన్.



ఎత్తిపొడుస్తున్నారు.

నా నవల్లో ఎదిరించిన హీరోయిన్‌లా నేను ఎంతో సుఖంగా స్వేచ్ఛగా బ్రతకడం లేదు. ప్రతి క్షణం ఈ సంఘం చేస్తున్న అవహేళనకు చస్తున్నాను. విప్లవాత్మక భావాలతో బయటపడిన నేను మగవాడి రక్షణ అండలేకపోతే పడే ఇబ్బందులు అన్నీ పడుతున్నాను. ఇప్పుడు నువ్వు ఆదర్శంగా తీసుకోవాల్సింది నా రచనలు కాదు నా జీవితం.

''నిశాంతిగారూ...'' తన అంచనా పూర్తిగా పొరపాటయినందుకు చిన్నబోయి చూస్తోంది నైనా.

''నిజ జీవితానికి రచనలకీ ఏం సంబంధం వుండదు— ఏ రచయిత జీవితం చూసినా! నా జీవితంలో సాధించలేనిది రచనల్లో చూపించి తృప్తిపడుతున్నాను. నువ్వుచెప్పిన సమస్యలు నా జీవితంతో పోల్చిచూస్తే చాలా స్వల్పమైనవి. త్వరపడి నిర్ణయానికి రాకుండా నా దగ్గరకొచ్చి మంచి పని చేశావ్. చక్కగా మీ శ్రీవారితో కలిసి కాపురం చేసుకో''

జ్ఞానోదయం కలిగిన దానిలా చటుక్కున వంగి నిశాంతి పాదాలు కళ్ళకద్దుకొని ''రచయితగా కాకపోయినా... ఒక ఓడిపోయిన ఇల్లాలిగా నా కళ్ళు తెరిపించారు. మిమ్మల్ని ఈ జన్మలో మరువలేను'' అంటూ వెనుదిరిగింది 'నైనా'

భర్త సాంగత్యంలో ఎప్పుడు శాంతిపొందుదామా అన్నట్లుగా ఆమె అడుగులు వడివడిగా పడుతున్నాయి. వెళుతున్న నైనా వైపు తృప్తిగా చూస్తోంది నిశాంత.

అంతా విన్నాక నిరంజన్ నవ్వుతూ ''మొత్తానికి నన్ను దుర్మార్గుడిగా చిత్రించావ్''

''సారీ! ఈ రోజుల్లో యువతపై రచనల ప్రభావం ఎక్కువగా వుంటోంది. కానీ రచయితలు మాత్రం అటువంటి ఆదర్శాలు మచ్చుకైనా పాటించటం లేదనే విషయం తెలియదు. కొంతమంది రచయితలు సగటు మనిషికంటే హీనమైన పరిస్థితులలో జీవిస్తున్నారంటే ప్రజలు నమ్మరు''

''అంతా తెలిసిన నీవు కూడా...''

''అవును నేను కూడా ఈ రచనా పోటీలో నిలదొక్కుకోవటాన్కి వచ్చిన పేరును నిలబెట్టుకోవడానికి నా మనస్సాక్షి కిష్టం లేని రచనలు చేయాల్సివస్తోంది. నన్ను ఆ.. దే.. వు.. డే... క్ష.. మిం..చా..లి'' పరాకుగా అంటోంది ఒక్కోమాట నిశాంతి. *